ఈనాడు
epaper.eenadu.net

# ఆస్తుల సేకరణ వేగవంతం

## అనుమతులు వచ్చేలోపే మెట్రో మార్గంలో కూల్చివేతలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టులేవీ సకాలంలో పూర్తయిన దాఖలాలు లేవు. రహదారుల విస్తరణ, పైవంతెనలు, మెట్రో, విద్యుత్తు, తాగునీటి, మురుగునీటి, వరద కాల్వ పనులవంటి వసతులకు సంబంధించిన ఏ ప్రాజెక్ట్ చేపట్టినా రైట్ ఆఫ్ వే (పనులు చేపట్టేందుకు కావాల్సిన స్థలం) లేకనే ఆలస్యం అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం భూసేకరణలో జాప్యమే. మెట్రోరైలు రెండోదశలోని పాతబస్తీ మెట్రోకు ఈ సమస్య లేకుండా చూడాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) దృష్టి పెట్టింది. కేంద్రం అనుమతులు వచ్చేలోపే ఆస్తుల సేకరణ చేపట్టింది. మెట్రోరైలు రెండోదశలో కారిడార్-6ని



ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. ప్రతిపాదించారు. ఈమేరకు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం గత ఏడాది నవంబరులో పంపించారు. ఈ ఏడాది ఆఖరు లేదా వచ్చే ఏడాది జరిగే జీహెచ్‌ఎంసీ ఎన్నికల నాటికి అనుమతులు వస్తాయనే ఆశాభావంతో అధికారులు ఉన్నారు. ఆలోపే ఆస్తుల సేకరణ పూర్తి చేయాలనేది హెచ్‌ఏఎంఎల్ లక్ష్యం.

### ఇంకో 250 ఆస్తులు

మెట్రో మార్గంలో 1100 వరకు ఆస్తులు ప్రభావితం అవుతున్నాయి. వీటిలో ఇప్పటికే 850 ఆస్తులను హెచ్‌ఏఎంఎల్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. యాజమానులు అంగీకరించడంతో రూ.300 కోట్ల వరకు పరిహారం అందజేశారు. ఆస్తుల సేకరణకు రూ.వెయ్యికోట్ల వరకు అవుతుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈమేరకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించింది. దశలవారీగా నిధులను విడుదల చేస్తోంది.

### అనేక సవాళ్ల నడుమ..

పాతబస్తీలో ఆస్తుల కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఒకదానికొకటి ఆనుకుని ఉన్న భవనాలు, వారసత్వ కట్టడాలు ఉండటంతో వాటికి నష్టం జరగకుండా పనులు చేపట్టారు. కూలీలతో కూల్చివేతలు జరుగుతుండటంతో కొంత ఎక్కువ సమయం పడుతోంది.

Date : 14/07/2025 EditionName : GREATER HYDERABAD PageNo :